నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ వసంతలక్ష్మి

మేడ్చల్: మండలంలోని గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వసంతలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. వివిధ పరిశ్రమలు, సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హత ఉన్న యువతతో భర్తీ చేసేందుకు వారితో మాట్లాడి మేళాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 208 మంది హాజరై 133 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఘట్‌కేసర్: ఎదులాబాద్ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం పుణ్యాహవాచనం, గీతాహవనము, కర్మ, సన్యాస, ఆత్మసంయమన, విజ్ఞాన అధ్యాయాల హవనం, లఘు పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రన్నింగ్ పోటీలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటారు. బిట్స్ పిలానీ నిర్వహించిన అరేనా–25 క్రీడా పోటీల్లో సెయింట్ పీటర్స్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అనిల్, వరలక్ష్మి పాల్గొనగా.. 3, 5 కిలోమీటర్ల రన్నింగ్ రేస్‌లో అనిల్ స్వర్ణం కైవసం చేసుకోగా.. వరలక్ష్మి 3 కిలోమీటర్లు, 400 మీటర్ల రన్నింగ్‌లో స్వర్ణం, 100 మీటర్ల కేటగిరీలో కాంస్యాన్ని సొంతం చేసుకుంది. కళాశాల సెక్రటరీ టీ.వీ.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్ రెడ్డి, పీడీ వెంకటనారాయణ, పీఆర్వో రవిసుధాకర్ విద్యార్థులను అభినందించారు.

రోటరాక్ట్ క్లబ్ ఏర్పాటు



సాక్షి,సిటీబ్యూరో: మహీంద్రా విశ్వవిద్యాలయంలో రోటరాక్ట్ క్లబ్ సోమవారం ఏర్పాటైంది. చార్టర్ ప్రెసిడెంట్ నందనరెడ్డి, సెక్రటరీ యశ్వి సెక్సరియా ఆధ్వర్యంలో బోర్డ్ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్ గెల్లి, యూనివర్సిటీ అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ బిష్ణు, కౌశల్ తాళ్లూరి నీలా వోడెలా పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



బోడుప్పల్: చెంగిచర్ల క్రాంతి కాలనీ అధ్యక్షుడిగా దండం ఎల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బండి రంజిత్‌గౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం వారు మాట్లాడుతూ.. అభివృద్ధిలో తమ కాలనీ వెనుకబడి ఉందని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు. తమ గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, నాయకులు రంగ బ్రహ్మన్నగౌడ్, విక్రంగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నీ బాధితులకు భరోసా

- మేడ్చల్ ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సేవలు
- ఐదు పడకలతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో డయాలసిస్ కోసం నగరానికి రోగులు వెళ్లాల్సి వచ్చేది. ఈ సేవలతో మేడ్చల్‌తో పాటు సమీప ప్రాంతాల డయాలసిస్ రోగులకు వైద్య సదుపాయం సులభతరమైంది. జనవరి 16 న సాప్ మెడికల్ సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు ప్రారంభించారు. ఐదు పడకలతో రోగులకు సేవలు అందించనున్నారు.

◆ ప్రస్తుతం మేడ్చల్, సమీప ప్రాంతాలకు చెందిన పలువురు రోగులు సేవలు అందుకుంటున్నారు. పదుల సంఖ్యలో రోగులు వచ్చినా కేంద్రంలో సేవలు అందించే అవకాశం ఉంది. వారానికి రెండు, మూడుసార్లు రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. రోగులు డయాలసిస్ చేయించుకునేలా ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకంలో సౌకర్యం కల్పించింది.

వారానికి రెండు,మూడుసార్లు...

కిడ్నీ ఫెయిల్ అయిన రోగులను నెఫ్రాలజిస్టులు డయాలసిస్‌కు రెఫర్ చేస్తారు. ఆ రోగులకు అక్కడ డయాలసిస్ చేస్తారు. డయాలసిస్ కావాల్సిన వారి వివరాలను ఆరోగ్యశ్రీలో నమోదు చేయించిన తర్వాత డయాలసిస్ చేస్తున్నారు. రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు,మూడుసార్లు డయాలసిస్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒకసారి రిజిస్ట్రేషన్ అయిన రోగులకు జీవితకాలం మొత్తం ఇక్కడ ఉచితంగా డయాలసిస్ చేయనున్నారు. రోగులకు రక్తం రావడానికి కావాల్సిన మందులు, ఇంజక్షన్లను ఉచితంగా అందజేస్తున్నారు.

చికిత్స విధానం ఇలా...

కిడ్నీ సమస్యలకు నేడు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. డయాలసిస్ రెండు రకాలుగా ఉంటుంది. పెరిటోనియల్ డయాలసిస్‌తో కిడ్నీ పాడైన వ్యక్తి బొడ్డు నుంచి ట్యూబ్ వేసి డయాలసిస్ ఫ్లూయిడ్లతో చికిత్స అందిస్తారు. వారంలో రెండు, మూడుసార్లు చేయించుకోవాల్సి ఉంటుంది.దీన్ని ఇంటి దగ్గరే బాధితులు చేసుకోవచ్చు. రెండో రకం హిమో డయాలసిస్ వైద్యుల పర్యవేక్షణలో రక్తనాళాలతో మిషన్ ఉపయోగించి రక్తాన్ని శుద్ధి చేస్తారు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. మేడ్చల్ ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా సేవలు అందిస్తున్నారు.


రోగులకు కోసం ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు



మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ రోగులకు ఉచితంగా సేవలు అందిస్తున్నాం. మేడ్చల్‌తో పాటు సమీప ప్రాంతాల నుండి కిడ్నీ రోగులు వస్తున్నారు. వారికి చికిత్స అందిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. మేడ్చల్‌తో పాటు సమీప ప్రాంతాల రోగులు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– అబ్దుల్ రెహమాన్, సాప్ క్లస్టర్ మేనేజర్

ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు

మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో ఉచితంగా వైద్యం అందిస్తున్నారని తెలుసుకుని ఇక్కడికి వచ్చి సేవలు పొందుతున్నాను. గతంలో నగరానికి వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాణ్ణి. ప్రస్తుతం మేడ్చల్‌లోనే వైద్యుల పర్యవేక్షణలో సేవలు అందించడం బాగుంది.

– అశోక్, మేడ్చల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలాజీనగర్ ప్రధాన రహదారి, మహంకాళి రోడ్డు, మార్కెట్‌రోడ్డు, శాంతినగర్, ముత్తుస్వామినగర్, వేంకటేశ్వరకాలనీ, చంద్రపురికాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌ఓసీ అందజేత

కీసర: నాగారం మున్సిపాలిటీ సింహపురికాలనీకి చెందిన మోహన్‌రెడ్డి ఊపిరితిత్తుల వ్యాధితో ఇటీవల నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ. 2,50,000 ఎల్‌ఓసీ మంజూరు కాగా.. బాధిత కుటుంబానికి కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అందజేశారు. నాగారం మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

రామంతాపూర్: రామంతాపూర్ ప్రభుత్వ జీఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో నేటి నుంచి బుధవారం వరకు రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ ప్రకటించారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన హాజరవుతారని సమాచారం.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ ఘనాపూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపేయాలని స్థానికులు మహేశ్వర్‌గౌడ్, కృష్ణారెడ్డి ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 1140, 1141లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

శిఖం భూమిలో రోడ్డు వేశారని..

మేడ్చల్: అత్వెల్లి వేంకటేశ్వర ఆలయం పక్కన ఉన్న శిఖం భూమిలో ఓ రియల్టర్ స్థానిక నేతల అండతో సీసీరోడ్డు నిర్మాణం చేశాడని, అత్వెల్లి మాజీ సర్పంచ్ యాదగిరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆలయం పక్కన భూమి మొత్తం చెరువు శిఖం భూమిగా ఉండగా.. ఓ రియల్టర్ తన వెంచర్‌కు రోడ్డును అక్రమంగా వేయడంతో పాటు సీసీ కూడా వేశాడని అధికారులకు ఫిర్యాదు చేశాడు.


ఆలయం పక్కన నిర్మించిన రోడ్డు

సర్వే నంబర్ 415 రికార్డుల్లో ప్రభుత్వ భూమి, శిఖం భూమి అని ఉండగా.. సదరు భూమి దేవాదాయ శాఖ భూమి అని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించాడు. దేవుడి ముసుగులో శిఖం భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఫిర్యాదులో కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా ఎస్ కొండాపూర్ తండాకు చెందిన రమేష్(30) మేడ్చల్ పట్టణంలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నారు. రోజువారీ కూలీగా పనిచేస్తున్న అతడు మద్యానికి బానిసై ఇంట్లో భార్యా పిల్లలను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి వచ్చిన అతడు భార్యతో గొడవపడ్డాడు. రాత్రైనా గొడవ ఆపకపోవడంతో భార్య ఇంట్లో నుండి బయటకు పంపించింది. సోమవారం ఉదయం వారు ఉంటున్న ఇంటికి సమీపంలో రమేష్‌విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అతడు మద్యం మత్తులో మరణించాడా.. ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య, పెద్ద కుమార్తె పోలీసుల అదుపులో ఉన్నారు. మృతుడు హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

క్లూస్ టీమ్ ఆధారాల సేకరణ..

మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై బయటికి కనిపించే గాయాలు పెద్దగా లేవని, మెడపై అక్కడక్కడ గోరు గుర్తులు ఉన్నాయని ఏసీపీ వివరించారు. మృతుడి భార్యను విచారించగా మద్యం తాగి గొడవ చేస్తుండటంతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు పంపించి పిల్లలతో కలిసి నిద్రకు ఉపక్రమించినట్లు ఆమె చెప్పిందన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

క్షతగాత్రుడి విలువైన వస్తువుల అప్పగింత

కీసర: మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలో కీసర ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం రాత్రి 10 గంటలకు చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటున్న రాజు (32) ఆదివారం ఉదయం భువనగిరికి పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని తిరిగొచ్చే సమయంలో ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రింగ్ రోడ్డుపై వెళ్లే తోటిప్రయాణికులు గమనించి వెంటనే 108కు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడి వద్ద ఉన్న బంగారు గొలుసు, మొబైల్‌ఫోన్, పర్సులో ఉన్న రూ.18,500లను భద్రపరిచి అతడి కుమారుడు ధనుంజయ్‌కు ఆసుపత్రిలో 108 సిబ్బంది రవి, పైలట్ ఆంజనేయులు అప్పగించారు. దీంతో వారిని గాంధీ ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

యువతులపైకి దూసుకెళ్లిన రెడీమిక్స్ వాహనం


ప్రమాదానికి కారణమైన కాంక్రీట్ రెడీమిక్స్ వాహనం


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శామీర్‌పేట్: బస్సు కోసం వేచిచూస్తున్న ఇద్దరు యువతులపై నుంచి రెడీమిక్స్ వాహనం దూసుకెళ్లిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ, అంతాయిపల్లికి చెందిన కొరివి గాయత్రి, కొరివి భవానీలు తిరుమలగిరిలో ఉద్యోగం చేస్తుంటారు. కాగా రోజూ మాదిరిగానే తిరుమలగిరి వెళ్లేందుకు సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బిట్స్ పిలానీ జంక్షన్ సమీపంలోని వెదురు వనం వద్ద బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కీసర నుంచి (టీఎస్08యూఈ7430) ఆర్ఎంసీ కాంక్రీట్ వాహనం అతివేగంతో కారును తప్పించబోయి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తుల ధర్నా...

అంతాయిపల్లి రోడ్డుపై వాహనాలు అతివేగంతో వెళ్తున్నాయని, గతంలో కూడా ప్రమాదాలు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో మంటలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కీసర: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో వైన్స్ వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడనే సమాచారంతో అతడిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 8712662191,8712662115.

మల్లిఖార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు

బోడుప్పల్: అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీలోని పాత మల్లన్న గుడి ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం 7 గంటలకు 108 కలశాలతో సమస్త నదుల తీర్థాలతో శివాభిషేకం, 8 గంటలకు మహాపడిపూజ, సహస్ర లింగార్చన, రాత్రి అగ్నిగుండం నందికోల, వీరభద్రుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ కొండల్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సిద్దప్ప గురుస్వామి, బాల్‌రెడ్డి గురుస్వామి, వేద పండితులు ప్రకాష్, గోపాలాచార్యులు, రాహుల్ దూబె, లక్ష్మీనారాయణ, వేణువర్మ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం హనుమాన్ తెక్డీ ప్రాంతానికి చెందిన ఉంద్రాజ్ రవి (48), కుమారుడు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 9న మధ్యాహ్నం భార్య లక్ష్మిని మద్యానికి డబ్బులు అడగగా.. ఆమె ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాత్రి నిద్రకు ఉపక్రమించిన సమయంలో ఒంటి గంట సమయంలో రవి అరిచినట్లు శబ్దం వినిపించింది. భార్య నిద్రలేచి చూసేసరికి భర్త సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే 108కు సమాచారం ఇవ్వగా వారు కిందకి దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండారి పద్మకు ప్రముఖుల నివాళి



కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి భార్య బండారి పద్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం సైనిక్‌పురిలోని వారి నివాసం నుంచి కీసర మండలం చీర్యాల వరకు అంతిమయాత్ర కొనసాగింది. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె మరణవార్త తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ సైనిక్‌పురికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మాజీమంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

గ్రామకంఠం నివాసితుల ట్యాక్స్ తీసుకోవాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ గ్రామకంఠంలో నివసించే వారికి ఇంటి పన్ను తీసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు కమల్ జిల్లాలోని ప్రజావాణిలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018, 2019, 2020 వరకు నిర్మించిన ఇళ్లకు మాన్యువల్‌గా ఇచ్చిన ట్యాక్స్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో చేర్చకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'హోల్డర్ ఆఫ్ ద ప్రాపర్టీ' అని ఇంటి పన్ను ఇస్తున్నారని, కనీసం గ్రామకంఠంలో నివసించే ప్రజలకు మాన్యువల్‌గా కట్టిన టాక్స్‌లో ఆన్‌లైన్‌లో రాకపోతే వాటిని వారి పేరుపై ట్యాక్స్ చేయాలన్నారు. హోల్డర్ ఆఫ్ ద ప్రాపర్టీ అని ఇస్తే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇక్కడ నివసించే ప్రజల నుంచి తప్పకుండా ఇంటి పన్ను తీసుకోవాలన్నారు. నాయకులు కర్లపూడి జోగారావు, మహేందర్‌యాదవ్, లిఖిత, రామునాయక్, వెంకన్న, యాదగిరి, మహేశ్వరి, అనిల్, రాజు, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

85గ్రాముల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్: దొంగచాటుగా గంజాయిని దాచిన యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఘట్‌కేసర్ నుంచి గుంటిగూడెం వెళ్లే దారిలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా గుంటిగూడెంకు చెందిన బైక్ మెకానిక్ చింత శివకుమార్‌గా (24) తేలింది. మూడేళ్లుగా గంజాయికి అలవాటు పడి అవసరం ఉన్నప్పుడు ధూల్‌పేట్‌కు వెళ్లి కొనుగోలు చేసి చిన్న చెరువు కట్టపై చెట్ల పొదల్లో రాళ్ల కింద దాచి సేవించడం, ఇతరులకు విక్రయించేవాడు. అతడి సమాచారం మేరకు చెరువు కట్టపై చెట్ల మొదలులో రాళ్ల కింద దాచిన 85 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితుడు శివకుమార్

రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో జాతీయ రహదారితో పాటు సర్వీస్ రోడ్లపైనే వాహనాలను అక్రమంగా పార్క్ చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నారపల్లిలో జాతీయ రహదారిపైన కూడా భారీ వాహనాలు బారులు తీరుతున్నాయి. టాటా, మహీంద్రా కార్ల స్టాక్‌యార్డులను నారపల్లిలో ఏర్పాటు చేయడంతో కంపెనీల్లో తయారైన కార్లు, వ్యాన్లను భారీ వాహనాల్లో తీసుకొచ్చి జాతీయ రహదారిపై అన్‌లోడ్ చేసి స్టాక్ యార్డుకు తీసుకెళ్తున్నారు. దీంతో ట్రాఫిక్ తరచుగా స్తంభిస్తోంది. ఇలాంటి స్టాక్ యార్డు అన్నోజిగూడలోని సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. స్టాక్ యార్డులోకి భారీ వాహనాలు వెళ్లే దారి లేనప్పుడు స్టాక్ యార్డులను ఎందుకు ఏర్పాటు చేయనిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జనాలకు ఇబ్బందులు కలిగించే స్టాక్ యార్డులను దూరప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.



రేషన్‌బియ్యం పట్టివేత

ఉప్పల్: అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం వాహనాన్ని ఉప్పల్ పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడ జెర్సీ కంపెనీ వద్ద రాజస్తాన్ రాష్ట్రానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 19 టన్నుల బియ్యాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్ అఫ్జల్, జంగయ్యలను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జెడ్సీకి వినతి
- సమస్యలు పరిష్కరించాలన్న కార్పొరేటర్ శ్రవణ్
- ప్రజావాణిలో వాడివేడి చర్చ

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జెడ్సీ రవికిరణ్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం, మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ప్రజల నుంచి సమస్యలు వివరిస్తున్నా పరిష్కరించనప్పుడు ప్రజావాణి కార్యక్రమం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కులు, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరామన్నారు. సీసీరోడ్ల నిర్మాణం కూడా చాలా కాలనీల్లో పెండింగ్‌లో ఉన్నాయని నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. కొందరు అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. వారికి సకాలంలో వేతనాలు అందుతున్నాయని, సర్వేలో పాల్గొన్న వారికి డబ్బులు ఇవ్వడానికి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని, ఇది సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.


జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి